క్లుప్తంగా

వైద్యశిబిరానికి స్పందన


వైద్య శిబిరానికి హాజరైన వృద్ధులు

విజయనగరం రూరల్: జాతీయ వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్‌ఓ ఎస్‌. జీవనరాణి ఆదేశాల మేరకు మండలంలోని ద్వారపూడి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. గ్రామంలోని మహాత్మా గాంధీ వృద్ధాశ్రమం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు వృద్ధులకు బీపీ, షుగర్‌, దంత, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్‌ వీవీవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్‌ రవిశేఖర్‌, డాక్టర్‌ వినీత్‌, డాక్టర్‌ అర్చన, ఫిజియోథెరపిస్ట్‌ స్వాతి, ల్యాబ్‌ టెక్నీషియన్‌ నాయుడు ఆదినారాయణ, సిబ్బంది సునీత, సీహెచ్‌ రాజు, మంగమ్మ, సాయి రమణి, తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌ప్రోగ్రాంతో నీటి ఎద్దడి నివారణ


క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంట వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న విశ్రాంత ఏఎస్పై నాగరాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని విశ్రాంత ఏఎస్పై నాగరాజు ఆకాంక్షించారు. మండలంలోని సారిపల్లి ఉన్నత పాఠశాలలో 55 మంది విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'ను విజయవంతం చేయండి


వ్యాపారులతో మాట్లాడుతున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో మూడో శనివారం నిర్వహించనున్న 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య పర్యవేక్షకులు నగరంలోని పలు ప్లాస్టిక్‌ దుకాణాల వద్దకు బుధవారం వెళ్లి అవగాహన కల్పించారు. నిషేధిత ప్లాస్టిక్‌ వస్తువులను విక్రయించరాదని తెలిపారు. ప్లాస్టిక్‌ కారకాల వల్ల మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారగలదన్న ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాదేశాలను అతిక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. దుకాణాలను సీజ్‌ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవి, శేఖర్‌, తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లిమర్ల: నగర పంచాయతీకి చెందిన ప్రజలు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్‌ కె. అప్పలరాజు సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ, ఈడబ్ల్యూఎస్‌ కేటగిరీలకు చెందిన వారు తమ కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు రైస్‌ కార్డు, బ్యాంక్‌ అకౌంట్‌ కాపీలతో వార్డు సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు నగర పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

జనం గుండెల్లో.. వైఎస్సార్‌సీపీ జెండా

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ జెండాలు ఎగురవేసిన నాయకులు


పూసపాటిరేగలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం వాడవాడలా బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జెండా ఎగుర వేసి, కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. పూసపాటిరేగ మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జెండాను నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఎగురవేశారు. అనంతరం కేక్‌ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటుతున్నా ఒక్క సంక్షేమ పథకం ఊసెత్తలేదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ రాక దగాపడ్డ ఎంతో మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అండగా ఉంటామన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన నిధులు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజలు చేతిలో పాశుపతాస్త్రంగా మారిన వైఎస్సార్‌సీపీపై ప్రజలలో చెక్కుచెదరని నమ్మకం ఉందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని స్పష్టం చేశారు. ప్రజల కోసమే ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీకి ప్రతిఒక్కరు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్‌ ఎంపీపీలు అల్లాడ రమేష్‌, ఎస్‌. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, మొంగం నాగబాబు, దాడిశెట్టి త్రినాథరావు, గుజ్జు సురేష్‌ రెడ్డి, నడిపేన రమణ, మహంతి లక్ష్మణరావు, ఎడ్ల రామకృష్ణ, పిన్నింటి ఎల్లంనాయుడు, టొంపల సీతారాం, శాంతాటి శ్రీనివాసరావు, ఎంకో మోహన్‌, దారపు లక్ష్మణరెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, పతివాడ సత్యం, బావిశెట్టి నారాయణరావు, దంగుడు బియ్యపు ఈశ్వరరావు, చందక వరలక్ష్మి , దేబార్కి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


కేక్‌ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం


కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపెద్దలు

నెల్లిమర్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 7.30 గంటలకు చండీహోమం జరిపించారు. 10.39 గంటలకు యంత్రబింబస్థాపన, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, మహాకుంభ నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం యాగశాలలో మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చిక్కాల సాంబశివరావు, కడగల ఆనంద్‌కుమార్‌, లెంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీనివాసరావు, సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, చిక్కాల సుమతి, చిక్కాల సంతోష్‌ కుమార్‌, నల్లి శ్రీను, కనకల హైమావతి, కలిశెట్టి కన్నంనాయుడు, భోగాపురపు రామకష్ణ, బైరెడ్డి కల్యాణ్‌ చక్రవర్తి, పంచాది కిరణ్‌, మజ్జి గణేష్‌, చిక్కాల రవి, ముడిమంచి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో రోబోటిక్స్‌ సెంటర్‌


పరీక్ష విజేతలతో మాజీ ఎంపీ డాక్టర్‌ బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల సిబ్బంది

విజయనగరం అర్బన్‌: గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్‌ కళాశాల ఈసీఈ విభాగంలో ఈ–యంత్ర రోబోటిక్స్‌ సెంటర్‌ను పార్లమెంట్‌ మాజీ సభ్యురాలు డాక్టర్‌ బొత్స ఝాన్సీలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఐఐటీ ముంబై సహకారంతో ఏర్పాటు చేసి ఈ సెంటర్‌లో ఎంబెడెడ్‌ సిస్టమ్స్‌, రోబోటిక్స్‌లో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని పెంపొందించేందుకు వినియోగిస్తారని కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ ఎం.శశిభూషణరావు తెలిపారు. గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు స్టార్టప్‌లను ప్రారంభించడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం ఐఐటీ ముంబై వారు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ డీవీ రామమూర్తి, వైస్‌ ప్రిన్సిపాల్‌, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్‌ టీడీవీఏ నాయుడు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా కళాశాల కంప్యూటర్‌ సైన్స్‌ విభాగం ఆధ్వర్యంలో ' అగ్‌మెంటెడ్‌ రియాలిటీ, వర్చువల్‌ రియాలిటీ' అనే కంప్యూటర్‌ ల్యాబ్‌ను కళాశాల కరెస్పాండెంట్‌ డాక్టర్‌ బొత్స ఝాన్సీలక్ష్మి ప్రారంభించారు.

గుర్తింపు... గౌరవం కోసం



గరివిడి శ్రీ వెంకటేశ్వర పశువిశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న బీవీఎస్‌ విద్యార్థులు(ఫైల్‌)

- స్టైఫండ్‌, వీసీఐ గుర్తింపు కోసం గరివిడి వెటర్నరీ యూనివర్సిటీ బీవీఎస్‌ విద్యార్థుల పోరాటం
- నెల రోజులుగా రిలే నిరాహార దీక్షలు
- కనికరించని కూటమి ప్రభుత్వం
- విద్యార్థులను భయాందోళనలకు గురి చేస్తున్న ప్రభుత్వ చర్యలు

చీపురుపల్లి: వారేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. తగిన గౌరవం, గుర్తింపు ఇస్తే చాలని అంటున్నారు. వారే గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర పశువిశ్వవిద్యాలయంలో బ్యాచలర్‌ ఆఫ్‌ వెటర్నరీ సైన్స్‌ (బీవీఎస్‌) చదువుతున్న విద్యార్థులు. ఎంబీబీఎస్‌ చదివే మెడికోలు మనుషులకు వైద్యం చేస్తే.. బీవీఎస్‌ చదువుతున్న తాము మూగ జీవాలకు వైద్యం చేసి ప్రాణం పోస్తామని, అలాంటి తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువిశ్వ విద్యాలయంలో విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 37 రోజులుగా మండు టెండలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారిపై కరుణ, జాలి చూపించడం లేదు సరి కదా యూనివర్సిటీ ముసుగులో వారిని భయాందోళనలకు గురి చేసేలా చర్యలు చేపడుతోంది. దీక్షలు విరమించి తరగతుల్లో చేరకపోతే వసతి గృహాలు మూసివేస్తామని హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా ఈ నెల 3న వసతి గృహాలు మూసివేసే వరకు వెళ్లింది. దీంతో విద్యార్థులు అంతా మరింత ఉద్యమ బాట పట్టారు. యూనివర్సిటీ ప్రధాన గేటుకు అడ్డంగా బైఠాయించి నిరసన ఉధృతం చేశారు. కళాశాల అసోసియేట్‌ డీన్‌ నుంచి అధ్యాపకులు, సిబ్బందిని లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో యూనివర్సిటీ అధికారులు వసతి గృహాలను తెరిపించాల్సి వచ్చింది. ప్రభుత్వం భయపెట్టిందుకు చూస్తున్నప్పటికీ విద్యార్థులంతా ఒక్కటిగా నిలిచి తమ డిమాండ్ల సాధనకు నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు.

చలించని ప్రభుత్వం

గరివిడిలోని పశువిశ్వ విద్యాలయంలో బ్యాచలర్‌ ఆఫ్‌ వెటర్నరీ సైన్స్‌(బీవీఎస్‌) కోర్సులో 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెడికోలతో సమానంగా నెలకు రూ.25 వేలు స్టైఫండ్‌ ఇవ్వాలని, స్థానిక కళాశాలకు వీసీఐ (వెటర్నరీ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా) గుర్తిం పు కల్పించాలని కోరుతూ విద్యార్థులు ఫిబ్రవరి 3న రిలే నిరాహార దీక్షలు ప్రారంభిం చారు. 37 రోజులుగా కళాశాల ఎదుట టెంట్లు వేసుకుని రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు.రాష్ట్రంలో గరివిడితో పాటు ప్రొద్దుటూరు, గన్నవరం, తిరుపతిలో ఉన్న నాలుగు కళాశాలల్లోను విద్యార్థులు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. దీక్షలు ప్రారంభించి నెల రోజులు గడిచిపోయినా ప్రభుత్వంలో కనీసం చలనం రావడం లేదు.

వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం..


చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌ వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవం పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో స్వామివారికి చక్రస్నానం చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది ప్రజలు పాల్గొని.. స్వామివారి ప్రసాదం స్వీకరించారు. - డెంకాడ

చలివేంద్రం ఏర్పాటు


నెల్లిమర్ల మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్‌ పి. సుదర్శనరావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీలు రవిశంకర్‌, వీవీఆర్‌ జగన్నాథరావు, సత్యనారాయణ, మండల సర్వేయర్‌ టి. దివ్యమానస, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. -నెల్లిమర్ల

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి పరీక్షలు రాయనున్న 3,417 మంది విద్యార్థులు
- ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

మండలం	పదో తరగతి విద్యార్థులు
పూసపాటిరేగ	1058
నెల్లిమర్ల	1117
డెంకాడ	569
భోగాపురం	673


చదువుతున్న విద్యార్థులు

పూసపాటిరేగ: విద్యార్థి జీవితంలో ప్రధానమైన ఘట్టం పదో తరగతి పరీక్షలు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి మొదటి మెట్టు పదో తరగతి. దీంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శతశతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో పదో తరగతి పబ్లిక్‌ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. చదవడంతో పాటు అత్యధిక మార్కులు సాధించడానికి ఏమి చేయాలి అనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో వచ్చిన పేపర్లను చదివిస్తూ, రానున్న పరీక్షల్లో ఏ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందో అవగాహన కల్పిస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ ఏడాది పూసపాటిరేగ మండలంలో 1058 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పూసపాటిరేగ జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల కేంద్రంగా 290 మంది, పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల కేంద్రంగా 154 మంది, ఓక్‌ల్యాండ్‌ పాఠశాల కేంద్రంగా 260 మంది, ఆర్డర్‌ పాఠశాల కేంద్రంగా 189 మంది, రెల్లివలస జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల కేంద్రంగా 177మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాం..

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. పాఠ్యాంశాలపై వచ్చిన సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేశాం. స్టడీ మెటీరియల్‌ను పూర్తి స్థాయిలో చదివించాం. శతశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా కృషి చేస్తున్నాం.

– బి. శంకరరావు, హెచ్‌ఎం, పూసపాటిరేగ జెడ్పీ ఉన్నత పాఠశాల

ప్రత్యేక దృష్టి..


వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇచ్చాం. ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించి శతశాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది మంచి ఫలితాలు వస్తాయనే నమ్మకం పెరిగింది.

– బి. పాపునాయుడు, ఎంఈఓ–2, పూసపాటిరేగ

తనిఖీలు..

విజయనగరం: నగరంలో వివిధ ప్రాంతాల్లో సింగిల్‌ యూజ్‌ పాలిథిన్‌ ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలపై కార్పొరేషన్‌ అధికారులు బుధవారం దాడులు చేపట్టారు. సచివాలయాల వారీగా సిబ్బంది క్షేత్రస్థాయిలో టిఫిన్‌ దుకాణాలు, కిరణా దుకాణాలు, ఇతర బడ్డీల వద్ద సింగిల్‌ యూజ్‌ పాలిథిన్‌ ఉత్పత్తులు (కవర్లు, కప్పులు, గ్లాసులు) వినియోగిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ... పర్యావరణహితాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ స్వీయ నియంత్రణగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించడం లేదు..



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యం అప్పలనాయుడు

- ఏపీ మెడికల్‌ ల్యాబ్‌ టెక్నీషియన్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్‌: దశాబ్దాల తరబడి ల్యాబ్‌ టెక్నీషియన్స్‌ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఏపీ మెడికల్‌ ల్యాబ్‌ టెక్నీషియన్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు కర్రోతు సత్యం అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక అసోసియేషన్‌ కార్యాలయంలో ల్యాబ్‌ టెక్నీషియన్‌ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య రంగంలో డయోగ్నోస్టిక్‌ సేవలు కీలకమన్నారు. అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్‌ ల్యాబ్‌ టెక్నీషియన్స్‌కు సమానపనికి సమాన వేతనం, 100 శాతం గ్రాస్‌ వేతనం ఇవ్వాలన్నారు. అలాగే కాంట్రాక్ట్‌ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్‌ చేశారు. అన్ని పీహెచ్‌సీలలో రెండో ల్యాబ్‌ టెక్నీషియన్‌ను నియమించాలని కోరారు. ఎన్నికల కోడ్‌ వల్ల కొంతమంది కాంట్రాక్ట్‌ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆర్డర్స్‌ ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే రిలీజ్‌ చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ నాయకులు కిశోర్‌నాయుడు, బంగారునాయుడు, రవి, తదితరులు పాల్గొన్నారు.